క్లుప్తంగా

శివకుమార్‌కు బాపు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శివకుమార్

నారాయణఖేడ్: మండలంలోని అనంతసాగర్‌కు చెందిన పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్ బాపుపురస్కారం అందుకోవడంతో పాటు జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ప్రముఖ దర్శకుడు, చిత్రకారుడు బాపు 90వ జయంతిని పురస్కరించుకొని శివకుమార్ రావిఆకుపై బాపు చిత్రాల్ని మలిచినందుకుగాను పురస్కారంతోపాటు రికార్డ్స్‌లో నమోదుకు ఎంపికయ్యారు. శనివారం రాత్రి హైదరాబాద్ త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ నటుడు, ఆధ్యాత్మిక, సాహితీవేత్త తనికెళ్ల భరణి పురస్కారం అందజేశారు.

అంతర్వార్ గ్రామానికి జుక్కల్ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్/మనూరు: కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆయన అమ్మమ్మ గ్రామమైన నారాయణఖేడ్ మండలం అంత్వార్‌ను సందర్శించారు. ఆదివారం ఆయనకు కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికి. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి స్వగృహంలో ఘనంగా సన్మానించారు. అమ్మమ్మతో తనకున్న అనుబంధం, గ్రామస్థులతో ఉన్న పరిచయాలను పంచుకున్నారు. అనంతరం మనూరు మండలం బోరంచ నల్ల పోచమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్ షెట్కార్, దారం శంకర్, మాజీద్, హన్మాండ్లు, సద్దాం, ముఖ్య నాయకులు నర్సింహ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

లెనిన్‌కు సీపీఎం నేతల జోహార్లు



జోహార్లు అర్పిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: స్థానిక సీపీఎం కార్యాలయంలో విప్లవ పోరాట యోధుడు లెనిన్ 100వ వర్ధంతిని నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అతిమేల మాణిక్, ఖేడ్ నాయకులు కొటారి నర్సింహులు, చిరంజీవి, సంగయ్య, శ్రీనివాస్, రమేశ్, గౌతం లెనిన్ చిత్రపటానికి పూలమాలలువేసి జోహార్లు అర్పించారు.

సమస్యలను పరిష్కరిస్తా

కౌన్సిలర్ చంద్రారెడ్డి



కాలనీలో పర్యటిస్తున్న చంద్రారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): కాలనీల్లోతన దృష్టికివచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, కౌన్సిలర్ చంద్రారెడ్డి తెలిపారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మినగర్ కాలనీలో ఆదివారం ఆయన పర్యటించారు. కాలనీలోని సమస్యలను ప్రజలు వివరించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో దశలవారిగా పర్యటిస్తానని, సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వరప్రసాద్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాదయాత్ర

మునిపల్లి(అందోల్): ప్రజలు భక్తి మార్గంలో నడవాలని అంతారం జీవన్ముక్త సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ సూచించారు. తన సంస్థానం నుంచి ఏడుపాయల వనదుర్గ ఆలయం వరకు నిర్వహించిన పాదయాత్ర ఆదివారం ముగిసింది. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్రలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు పిలుపులు

- మూల మలుపుల వద్ద ఘటనలు
- ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- కనిపించని సూచిక బోర్డులు

జహీరాబాద్ టౌన్: రహదారులపై మూల మలుపులు ప్రమాదకరంగా తయారయ్యాయి. ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరుచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటి వరకు జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్ గ్రామ సమీపంలో గల మూల మలుపులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ కారును ఢీకొని బ్యాంక్ ఉద్యోగి మృతి చెందిన విషయం తెల్సిందే. కొన్ని రోజులకు ముందు అక్కడే ఒక ప్రమాదం చోటు చేసుకుని ఒకరు చనిపోయారు. తరుచు ప్రమాదాలు జరుగుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

వేగంగా వాహనాలు..

జహీరాబాద్ నుంచి మొగుడంపల్లి మీదుగా కర్నాటక రాష్ట్రంలోని చించోళీ వరకు ఉన్న రోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. గౌసాబాద్ గ్రామ సమీపంలో మూల మలుపు వద్ద రోడ్డు ఏటవాలుగా ఉండడంతో వాహనాలు వేగంగా వెళ్తుంటాయి. మలుపు మూలంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆ మూల మలుపు వద్ద పెద్ద గొయ్యి



గౌసాబాద్ రోడ్డులో ప్రమాద మూల మలుపు ఇదే..

కూడా ఉండడంతో వాహనాలు అదుపుతప్పి గోతిలో పడిపోతున్నాయి.

కానరాని హెచ్చరిక బోర్డులు

తరచు ప్రమాదాలు సంభవిస్తున్నా ఆర్అండ్ బీ అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జహీరాబాద్ మండలంలోని హోతి(కె), శేఖాపూర్, మల్చెల్మ గ్రామాల వద్దగల మూల మలుపులు కూడా ప్రమాదకరంగా మారాయి. హోతి(కె) వద్ద గల మూల మలుపులో ఇప్పటి వరకు పలు ప్రమాదాలు చోటు చేసుకుని చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. సమస్యను ఆర్అండ్‌బీ డీఈఈ



రోడ్డు మలుపులో ఉన్న గొయ్యి

నర్సింలు దృష్టికి తీసుకెళ్లగా గౌసాబాద్ సమీపంలో గల రోడ్డు మూల మలుపులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, గుర్తు తెలియని వ్యక్తులు వాటిని తొలగించారని చెప్పారు. వాటి స్థానంలో కొత్త బోర్డులను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిన్నారం మండలంలోని అండూర్, సోలక్‌పల్లి, ఊట్ల, జిన్నారం, మాదారం, గడ్డపోతారం గ్రామాల్లో రూ.2.35కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధిచేసేలా తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రామాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలీల సంక్షేమానికి పెద్దపీట

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పద్మశాలి కులస్తుల సంక్షేమానికి తన వంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆదివారం భేల్ అధికార కార్మిక సంఘం కార్యాలయ ప్రాంగణంలో 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించిన స్వర్ణోత్సవ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చేనేతరంగానికి పెద్దపీట వేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు, వివా హపరిచయ వేదిక వంటి కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శ్‌రెడ్డి, పుష్ప నగేశ్, రాగం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేతకీలో ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడి పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకేతకీ సంగమేశ్వర ఆలయంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి బల్మూరి వెంకట్ ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆలయానికి వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు స్వాతం పలికారు. పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ విభాగం రాష్ట్ర ఉప అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, మండల సీనియర్ నాయకులు సంగన్న ముదిరాజ్, రుద్రయ్య స్వామి,



అమ్మవారిని దర్శించుకుంటున్న వెంకట్

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

నారాయణఖేడ్: అవినీతిని ప్రశ్నిస్తున్నందున ఎల్‌పీహెచ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్‌పై తప్పుడు కేసులు నమోదు చేయడం సరికాదని లంబాడి హక్కుల పోరాటసమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాశ్‌రాథోడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణఖేడ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎంహెచ్‌ఓ అవినీతి, అక్రమాలపై రాజేశ్‌నాయక్ ప్రశ్నిస్తున్నందుకు అతడిపైనే కేసులు పెట్టిస్తున్నారని వాపోయారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా కొనసాగుతూ అవినీతికి పాల్పడుతున్నారని, అక్రమాలపై బహిరంగ చర్చకు వచ్చి నిరూపించుకోవాలని



మాట్లాడుతున్న ప్రకాశ్ రాథోడ్

సవాల్ విసిరారు. త్వరలో సీఎంను కలిసి అక్రమాలను వివరించనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



జిన్నారం: పరిశీలిస్తున్న తహసీల్దార్ గంగాభవాని

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని జిన్నారం, గడ్డపోతారం గ్రామాల్లోని పోలింగ్ భూత్‌లను తహసీల్దార్ రవికుమార్ ఆదివారం పరిశీలించారు. బీఎల్‌ఓలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గుమ్మడిదలలో తహసీల్దార్ గంగాభవాని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

ఓటర్ల నమోదుకు స్పెషల్‌డ్రైవ్

నారాయణఖేడ్: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులతో పాటు నూతన ఓటర్ల నమోదు కోసం ఆదివారం నారాయణఖేడ్ ఆర్డీఓ కార్యాలయంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు చోట్ల పేర్లు ఉన్న వారి వివరాలను గుర్తించి తొలగించారు. 18 సంవత్సరాలు నిండిన వారి పేర్లు చేర్చడం, తప్పులను సరిదిద్దే పనులు చేపట్టారు. ఆర్ఐ శ్యాంరావు పర్యవేక్షించారు.

అర్హులందరూ నమోదు చేసుకోవాలి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నందికంది గ్రామంలో ఆదివారం ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపులు కూడా చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ వీరేశం, ఆర్ఐలు గణేశ్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగాయత్‌ల అభివృద్ధికి కృషి

మునిపల్లి(అందోల్): వీరశైవ లింగాయత్‌ల అభివృద్ధి కోసం కృషి చేస్తానని వీరశైవ లింగయత్‌ల రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర్ అన్నారు. మండలంలోని మగ్దుంపల్లి గ్రామంలో లింగాయత్ నాయకులతో ఆదివారం ఆయన కలిసి మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ, సామాజికరంగాల్లో లింగాయత్‌లు ముందుండాలని పిలుపునిచ్చారు. వీరన్న, మర్పల్లి సంగన్న, మాజీ సర్పంచ్ షఫియొద్దీన్, బాబుమీయా ఆయనను శాలువతో సన్మానించారు.



సంగమేశ్వర్‌ను సన్మానిస్తున్న నాయకులు

సద్గురు కృష్ణా నందాజీకి ఘన స్వాగతం

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిప్పల్‌తుర్తి గ్రామంలో సద్గురుదామ ఆశ్రమానికి విచ్చేస్తున్న సద్గురుకష్ణానందాజీ మహారాజ్‌కు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సద్గురు కబీర్ సేన అధ్యక్షురాలు సంధ్యారాణి, చత్రునాయకుల ఆధ్వర్యంలో నర్సాపూర్‌లోని అర్చకుడు వీరప్ప, గురుస్వామి, సంజీవ్, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్, శివస్వాములు పూలదండలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం చిప్పల్‌తుర్తి ఆశ్రమం వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఈ ర్యాలీలో జై కృష్ణానందాజీ మహారాజ్ జైశ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆశ్రమం వరకు ఈ ర్యాలీ సాగించారు. సద్గురు కబీర్‌సేన అధ్యక్షురాలు సంధ్యారాణి, చత్రు నాయకుల ఆధ్వర్యంలో సద్గురు సేవా ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సద్గురు కబీర్ సేన, సేద్విప్ర సమాజ సేవ సభ్యులు నాగేందర్ గుప్తా, సురేశ్ నాయక్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ కాలనీలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1995–96లో చదువుకున్న విద్యార్థులు ఆదివారం జిల్లా పరిషత్ పాఠశాలలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఆనాటి తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తమ జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. పలు సంస్కృతిక కార్యక్రమాల నిర్వహించి సరదాగా గడిపారు.

నేడు రామాలయాల్లో ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని కోదండ సీతారామస్వామి దేవస్థానం, అదేవిధంగా మంజీరా క్యాంపస్‌లోని శ్రీరాముని దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం ఐదు గంటలకు రాములవారికి అభిషేకం, హోమం, భజన ఉంటుందని పేర్కొన్నారు. అయోధ్యలోని రాముని ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యేక ప్రసారాన్ని భక్తులు వీక్షించేందుకు స్క్రీన్ ఏర్పాటు చేశామని, ప్రాణ ప్రతిష్ఠ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఊరేగింపును విజయవంతం చేయాలి

పటాన్‌చెరు టౌన్: కోదండ సీతారామస్వామి ఊరేగింపును జయప్రదం చేయాలని శ్రీవరసిద్ధి వినాయక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్‌చారి పిలుపునిచ్చారు. సోమవారం అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా ఇంద్రేశం సిటిజన్‌కాలనీ సాయిబాబా దేవస్థానం సమీపంలోని కోదండ సీతారామస్వామికి ప్రత్యేక పూజలతో పాటు అదే రోజు సాయంత్రం ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఊరేగింపులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దేవాలయాలను శుభ్రపరిచిన భక్తులు

మునిపల్లి(అందోల్): మండలంలోని పలు ఆలయాలను భక్తులు శుభ్రపరిచారు. బుదేరా భ్రమరాంభ మల్లికార్జునస్వామి దేవాలయం, వెంకటేశ్వర స్వామి, అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవాలయాలను శుభ్రం చేశారు. సోమవారం అయోధ్యలో సీతారాముల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేసేందుకు పూజా సామగ్రిని సిద్ధం చేశారు.

శ్రీరామ నామ జపం

జహీరాబాద్: అయోధ్యలో సీతారామస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని జహీరాబాద్‌లో శ్రీరామ నామ జపం నిర్వహించనున్నట్లు కార్యక్రమ కమిటీ అధ్యక్షుడు అనంతరావు కుల్‌కర్ణి, కార్యదర్శి కృష్ణారావు, కోశాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. హౌసింగ్‌బోర్డు కాలనీలోని హనుమాన్ మందిరం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు సీత, రామ, లక్ష్మణ, హనుమాన్‌ల వేషధారణతో రథంపై యాత్ర కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి వక్తగా వీహెచ్‌పీ నేత రాజగోపాల్ హాజరుకానున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

అభయాంజనేయుడికి పూజలు

మునిపల్లి(అందోల్): అభయాంజనేయస్వామికి సోమవారం ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయల అర్చకుడు అయ్యప్పస్వామి ఆదివారం తెలిపారు. అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని బుదేరా చౌరస్తా సమీపంలో అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులందరూ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని కోరారు.



పరిసరాలను శుభ్రపరుస్తున్న యువకులు

ఊరూరా స్వచ్ఛ అభియాన్

జహీరాబాద్ టౌన్: అయోధ్యలో శ్రీబాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని జహీరాబాద్, మొగుడంపల్లి మండల పరిధిలోని గ్రామాల్లో స్వచ్ఛ అభయాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని ఆయా ఆలయాల పరిసర ప్రాంతాల్లో గ్రామస్తులు ఆదివారం శ్రమదానం చేసి పిచ్చిమొక్కలను తొలగించారు. మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్ గ్రామంలో యువకులు హనుమాన్ మందిరం వద్ద శుభ్రంచేశారు. జహీరాబాద్‌లో హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో శాంతినగర్ హనుమాన్, సంతోషిమాత, దత్తగిరి కాలనీ పంచముఖి హనుమాన్ ఆలయాల వద్ద శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ కబ్జాకు యత్నించిన వారిపై కేసు

పటాన్‌చెరు టౌన్: చెరువు ఫీడర్ ఛానల్ ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని యత్నించిన వ్యక్తిపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అమీన్‌పూర్‌లోని సర్వే నంబర్ 343లో పెద్దచెరువు నుంచి కుమ్మరి కుంట వరకు ఫీడర్ ఛానల్ ఉంది. ఈ ఫీడర్ ఛానల్ చెరిపివేసి భూమిని కబ్జా చేయాలని కొందరు వ్యక్తులు శనివారం తవ్వకాలు చేపట్టారు. స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఇరిగేషన్ ఏఈ ప్రసాద్ అక్కడికి చేరుకొని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

సంగారెడ్డి: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డిలో ఆదివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా ప్రభుత్వ ఆస్పత్రి, ఐబీ ఆవరణలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, జీజీహెచ్ ఆర్ఎంవో వీరాంజనేయులు, ఇంద్రనగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మనుజారెడ్డి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆదివారం చౌటకూర్లో ప్రదర్శనతో పాటు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్కూరి వీరమణి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్యే మాణిక్‌రావుకు వినతులు

జహీరాబాద్ టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని పలు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే మాణిక్‌రావుకు వినతి పత్రాలు అందజేశారు. పట్టణంలోని పస్తాపూర్ ఆనంద్‌నగర్ కాలనీ ప్రజలు సీసీరోడ్డు వేయించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి గత ప్రభుత్వం మున్సిపాలిటీకి రూ.50 కోట్లు మంజూరు చేసిందని, వాటితో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించామన్నారు. మిగిలిన నిధులు వచ్చిన వెంటనే రోడ్లు వేయిస్తామని చెప్పారు.

◆ మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వాలి

సంగారెడ్డి: మెదక్ ఎంపీ స్థానం తనకు కేటాయించాలని ఉద్యమ కారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బీరయ్యయాదవ్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం ఎన్నో కష్టాలు అనుభవించానని, ఎంపీ టికెట్ ఇవ్వాలని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వినతి పత్రం సమర్పించినట్లు చెప్పారు. ఉస్మాన్, అఖిల్, నరేశ్ పాల్గొన్నారు.

◆ దొంగకు దేహశుద్ధి

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్‌లో దొంగతనం చేస్తూ పట్టుబడిన ఓ యువకుడికి గ్రామస్తులు దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. కర్నాటకలోని కుసురంపల్లికి చెందిన బక్కప్ప కుమారుడు మహేశ్ కొంత కాలంగా గౌసాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి ఒక పొలం వద్ద కాపర్ తీగలు దొంగిలిస్తుండగా పట్టుపడ్డాడు. మహేశ్ నుంచి 5కిలోల కాపర్ వైర్ స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ నరేశ్ తెలిపారు.

◆ మద్యం దుకాణాల్లో తనిఖీలు

జహీరాబాద్: పట్టణంలోని పలు మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. ఆదివారం ఉమ్మడి మెదక్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రజిత ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటిస్తున్నారా? లేదా అని ఆరా తీశారు. అమ్మకాలకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. బెల్టుషాపులపై చర్యలు చేపడతామని సీఐ తెలిపారు. ఎస్ఐ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.



వేర్వేరు ఘటనల్లో నలుగురు అదృశ్యం

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణం మార్క్స్ నగర్‌కాలనీకి చెందిన రాథోడ్ హిరామన్ పనికోసం వెళ్లి అదృశ్యమయ్యాడు. మేస్త్రీగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న హిరామన్ శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడి భార్య సంగీత తన బంధువుల సాయంతో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె ఆదివారం సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి తెలిపారు.

కూలీ పనికి వెళ్లి..

ప్రగతినగర్ కాలనీకి చెందిన రాథోడ్ గంసిబాయి శనివారం కూలీ పనికోసం వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త రాథోడ్ దశరథ్ ఆదివారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సమాచారం తెలిసినవారు 08455–276333 నంబర్‌కు ఫోన్‌చేయాలని కోరారు.

మరో యువతి..

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని బిడెకన్నె గ్రామానికి చెందిన జ్యోతి హైద్రాబాద్‌లో నర్సు ట్రైనింగ్ చేస్తోంది. ఆమె శనివారం గ్రామానికి వచ్చింది. రాత్రి ఇంటి నుంచి కనిపించకుండా పోయిందని, అంతా వెతికినా ఆచూకీ లభించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె తండ్రి ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఇంటి నుంచి వెళ్లి ..

వట్‌పల్లి(అందోల్): ఇంటి నుంచి బయటకు వెళ్లి ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి పాండరి గత 6న రాత్రి 11గంటల సమయంలో తన బైక్‌పై ఇంటి నుంచి వెళ్లాడు. నాలుగు రోజులు గడుస్తున్నా అతను ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద వెతికిన ఆచూకీ దొరకలేదు. దీంతో ఈ నెల 10న జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు.



పాండరి(ఫైల్)